# ముంచుకొస్తున్న ముప్పు

## తూతూ మంత్రంగా డెంగ్యూ నివారణ దినోత్సవం

**ప్రజలలో అవగాహనకు కూడా కదలని వైద్య సిబ్బంది**

**ఆసుపత్రి ఆవరణ వరకే ర్యాలీ ప్రదర్శన**

**ఫొటోలకే పరిమితమవడంపై స్థానికుల విమర్శలు**

**యేటా కోరలు చాస్తున్న డెంగ్యూ**

**క్షేత్రస్థాయిలో నివారణ చర్యలు అంతంతమాత్రమే..**


కుల్కచర్ల ఆసుపత్రిలో అవగాహన ర్యాలీ దృశ్యం

**కుల్కచర్ల, మే, 16 ప్రభాతవార్త:** డెంగ్యూపై యుద్ధానికి సిద్ధం కావాలని ఉన్నతా ధికారులు ఇచ్చిన ఆదేశాలు కొన్ని చోట్ల క్షేత్రస్థాయిలో బుట్టదాఖల వుతున్నాయి. అత్యంత వేగంగా విస్తరిస్తున్న ప్రాణాంతక వైరల్ జ్వరాల్లో ఒకటైన డెంగ్యూపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు శనివారం పలు చోట్ల జాతీయ డెంగ్యూ దినోత్సవం నిర్వహించారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పిలుపు మేరకు, ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభానికి ముందే దోమల నియంత్రణ, ముందస్తు ఆరోగ్య జాగ్రత్తలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను చేపట్టారు. దేశవ్యాప్తంగా ప్రత్యేక హెల్త్ క్యాంపెయిన్లు, అవగాహన ర్యాలీలు ఊపందుకున్నాయి.

అయితే కుల్కచర్ల మండలంలో డెంగ్యూ నివారణ కోసం ప్రజలకు అవగాహన కల్పించటంలో అధికారులు విఫలమవుతున్నారు. యేటా వర్షాకాలం ముందు వైద్య సిబంది నామమాత్రపు చర్యలు చేపట్టి మమ అనిపిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో ప్రజారోగ్యంపై అవగాహన కోసం విస్తృతంగా ర్యాలీ నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించినా.. స్థానిక ప్రభుత్వాస్పత్రి సిబ్బంది ఆసుపత్రి ఆవరణలో కొద్ది దూరం ప్రదర్శన చేసి ఫోటోలకు ఫోజులు ఇచ్చి ముగించారు. కనీసం ఆరోగ్య కేంద్రం గేటు కూడా దాటి బయటకు రాకపోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. మొక్కుబడి ప్రదర్శన వలన యేమి ప్రయోజనం చేకూరుతుందని వారు ప్రశ్నిస్తున్నారు.

**యేటా పెరుగుతున్న డెంగ్యూ కేసులు**

ప్రతి సంవత్సరం మండలంలో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు చుట్టుముడుతూనే ఉన్నాయి. నిరుపేదలు అవగాహనా రాహిత్యం వలన ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేపోతున్నారు. వైరల్ ఫీవర్లతోపాటు, డెంగ్యూ మలేరియా వంటి విషపు జ్వారాలు ప్రజారోగ్యాన్ని పీల్చిపిప్పి చేస్తోంది. కొన్ని పంచాయతీలలో మురుగు నీరు నిల్వ ఉండటం, దోమలు స్వైరవిహారం చేయడం పరిపాటవుతోంది.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు కుల్కచర్ల వైద్య సిబ్బందిపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**నీరు నిల్వ ఉండే ప్రాంతాలలో వృద్ధి**

డెంగ్యూ అనేది ప్రధానంగా ఎడెస్ ఈజిప్టి అనే రకం దోమల కాటు వల్ల వ్యాపించే ఒక తీవ్రమైన అంటువ్యాధి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం, ఉష్ణమండల ప్రాంతాల్లో ఈ వ్యాధి తీవ్రత ఏటా పెరుగుతోంది. సాధారణంగా ఈ దోమలు పగటిపూట మాత్రమే కుడ తాయి. అలాగే, ఇళ్లలో లేదా పరిసరాల్లో నిల్వ ఉండే శుభ్రమైన నీటిలోనే (కూలర్లు, పూల కుండీలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, మూతల్లేని వాటర్ ట్యాంకులు) ఇవి గుడ్లు పెట్టి వేగంగా వృద్ధి చెందుతాయి.

**డెంగ్యూ లక్షణాలు ఇవీ..**

డెంగ్యూ సోకిన వ్యక్తి నుండి నేరుగా మరొకరికి ఈ వ్యాధి సంక్రమించదు. కేవలం ఇన్ఫెక్షన్ ఉన్న దోమ కుట్టడం ద్వారానే వైరస్ శరీరంలోకి ప్రవేశిస్తుంది. వైరస్ సోకిన 4 నుండి 10 రోజుల్లో డెంగ్యూ లక్షణాలు బయటపడతాయి. విపరీతమైన జ్వరం, తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, తీవ్రమైన కండరాలు మరియు కీళ్ల నొప్పులు, చర్మంపై ఎర్రటి మచ్చలు, వాంతులు, తీవ్రమైన నీరసం దీని ప్రధాన లక్షణాలు. అయితే, వ్యాధి ముదిరితే రక్తంలో ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోవడంతో పాటు అంతర్గత రక్తస్రావం, రక్తపోటు తగ్గడం వంటి ప్రమాదకరమైన డెంగ్యూ హెమరేజిక్ ఫీవర్ లేదా డెంగ్యూ షాక్ సింద్రోమ్ వంటి పరిస్థితులు తలెత్తుతాయి. ఈ నేపథ్యంలో, లక్షణాలు కనిపించిన వెంటనే ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో కీలకమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ఇమ్యూనిటీ తగ్గిన వాళ్లపై ఎక్కువ ప్రభావం**

ముఖ్యంగా తక్కువ రోగనిరోధక శక్తి ఉండే చిన్నపిల్లలు, వృద్ధులపై డెంగ్యూ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, వర్షాకాలంలో వారి పట్ల కుటుంబ సభ్యులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ సూచించింది.

**వారానికి ఒక రోజైనా 'డ్రై డే'**

ప్రతి ఇంటా వారానికి ఒక రోజైనా నిల్వ నీటిని తొలగించే 'డ్రై డే' పాటించాలని, శరీరాన్ని పూర్తిగా కప్పే దుస్తులు ధరించాలని, దోమతెరలు, మస్కిటో రిపెల్లెంట్లను వాడాలని పిలుపునిచ్చారు.

**అవగాహన ఉద్యమంలో విద్యార్థుల పాత్ర కీలకం**


ఈ అవగాహన ఉద్యమంలో పాఠశాలలు, విద్యార్థుల పాత్ర కీలకమని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థులు తమ పాఠశాలల్లోనూ, నివసించే పరిసరాల్లోనూ పరిశుభ్రతపై హెల్త్ అంబాసిడర్లుగా మారి సమాజంలో మార్పు తీసుకురావాలని కోరుతున్నారు.

**లార్వా నియంత్రణ చర్యలు ముమ్మరం అవ్వాలి**

స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రభుత్వ ఆరోగ్య శాఖలు ప్రస్తుతం డెంగ్యూ ప్రభావిత ప్రాంతాల్లో ఫాగింగ్, లార్వా నియంత్రణ చర్యలను ముమ్మరం చేయాలి.

సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే డెంగ్యూ రహిత సమాజం సాధ్యమవుతుందని.. జాతీయ డెంగ్యూ దినోత్సవం గుర్తు చేస్తోంది.

---



# రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్


# వార్త

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి/మేడ్చల్, మే 16, ప్రభాతవార్త:** అధికారుల జేబులు నిండితే చాలు.. ప్రజాభిప్రాయాలు గంగలో కలవాల్సిందేనా? ప్రభుత్వానికి కోట్ల రూపాయలు ఎగ్గొట్టి సీజ్ చేయించుకున్న చరిత్ర ఉన్నవారికే మళ్లీ రెడ్‌కార్పెట్ పరుస్తారా? అంటూ మేడ్చల్ జిల్లా రావల్ కోల్ గ్రామస్థులు అక్రమ క్రషర్ దందాపై నిప్పులు చెరిగారు. తమ ఊరి ముంగిట నిర్మిస్తున్న క్రషర్ మిషన్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కలెక్టరేట్ ముందు పార్టీలకు అతీతంగా రిలే నిరహారదీక్షలకు దిగారు. ఈ ఆందోళన నేపథ్యం వివరాలలోకి వెళితే..

**ఊరు ఊరంతా ఏకమై..**

గత నాలుగు సంవత్సరాల క్రితం(2021 నవంబరు) ఈ క్రషర్ ఏర్పాటుపై గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఏకగ్రీవంగా ఈ క్రషర్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ

# ప్రజాభిప్రాయానికి పాతర!






కలెక్టర్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్ష నిర్వహిస్తున్న రావల్‌కోల్ గ్రామస్తులు

**సీజ్ బ్యాచ్‌కు మళ్లీ పచ్చజెండా**

**పంట పొలాలు, ఇండ్ల మధ్య ధూళి దందాకు అనుమతులు**

**రావల్ కోల్ క్రషర్‌పై తిరగబడ్డ గ్రామస్థులు**

**నాలుగేళ్ల క్రితమే పార్టీలకతీతంగా వ్యతిరేకత**

**జనాగ్రహంతో వెనక్కి తగ్గిన అధికారులు**

**తాజాగా మైనింగ్ అనుమతులతో స్థానికులు ఆందోళన బాట**

**కలెక్టరేట్ ముందు రిలే దీక్షలు**

**క్రషర్ అనుమతులు రద్దు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిక**

తీర్మానం చేశారు. ప్రజల తీవ్ర వ్యతిరేకతను, అభిప్రాయాలను విన్న అప్పటి జిల్లా అదనపు కలెక్టర్ ఈ క్రషర్‌కు అనుమతులు ఇవ్వకుండా ఆపినట్లు స్థాని కులు గుర్తు చేస్తున్నారు. అయితే, ఆ ప్రజాభిప్రాయ సేకరణను బేఖాతరు చేస్తూ, మళ్లీ ఈ సంవత్సరం 2026 ఫిబ్రవరి నెలలో మైనింగ్‌కు అనుమతులు ఇస్తున్నట్లుగా అసిస్టెంట్ డైరెక్టర్ పేరు మీద ఒక లేటర్ వెలువడటం ఆందోళనకు గురిచేసిందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో గ్రామపంచాయతీ ఎన్‌వోసి కానీ, మున్సిపల్ ఎన్‌వోసీ కానీ లేకుండా మైనింగ్ శాఖ వారు ఈ విధంగా అనుమతులు ఇవ్వడం పూర్తిగా అక్రమమని వారు మండిపడ్డారు.

**ప్రజాభిప్రాయ సేకరణ డ్రామా నేనా!**

"నాలుగేళ్ల కిందట జనం చెప్పిన మాటకు.. ఇప్పుడు ఏడీ ఇచ్చిన లెటర్‌కు ఏమైనా సంబంధం ఉందా? అప్పుడు జనం నిర్ణయానికి విలువ లేనప్పుడు ఆ ప్రజాభిప్రాయ సేకరణ డ్రామా ఎందుకు?" అంటూ గ్రామస్థులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

**పేదల ఇళ్ల చెంత కాలుష్యం చింత!**

ఈ అక్రమ క్రషర్ నిర్మిస్తున్న సర్వేనెంబరు 111 భూమి పక్కాగా నివాస ప్రాంతాలకు కేటాయించిన ఆర్1 జోన్ లో ఉంది. దీని పక్కనే హెచ్‌ఎండీఏ వెంచర్లు ఉన్నాయి. పోనీ, ఊరికి దూరంగా ఉందా అంటే అదీ లేదు. క్రషర్‌కు ఆనుకొనే వ్యవసాయ పంట పొలాలు ఉన్నాయి. కేవలం పది అడుగుల దూరంలోనే ఇందిరమ్మ ఇండ్లు, 200 మీటర్లలో ఆశ్రమం, అర కిలోమీటర్ దూరంలో రావల్‌కోల్ గ్రామం ఉంది. చుట్టుపక్కల కాసంబైతండ, గుబ్బడిగుట్ట తండ, దొంగలగుట్ట తండాల ప్రజలు నిత్యం తిరిగే దారి అది. గ్రామపంచాయతీ ఎన్‌ఓసి లేదు, మున్సిపల్ అనుమతీ లేదు.. కానీ మైనింగ్ అధికారులు మాత్రం నిబంధనలన్నింటినీ తుంగలో తొక్కి అక్రమంగా పచ్చజెండా ఊపేశారని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**మైనింగ్ రాయితీ ఎగ్గొట్టిన వాళ్లకే మళ్లీ అనుమతి**

ఈ క్రషర్ నిర్వాహకుల ట్రాక్ రికార్డ్ చూస్తే మరీ విచిత్రంగా ఉంది. గతంలో వీరికి మునీరాబాద్‌లో ఒక క్రషర్ ఉండేది.

ప్రభుత్వానికి కోట్ల రూపాయల మైనింగ్ రాయల్టీ ఎగ్గొట్టడంతో అధికారులు ఆ క్రషర్‌ను సీజ్ చేశారు. ప్రభుత్వానికే కోట్లు నామం పెట్టిన సదరు ఘనుల కుటుంబానికే, మళ్లీ రావల్ కోల్‌లో క్రషర్ పెట్టుకోవడానికి అధికారులు ఎలా పర్మిషన్ ఇచ్చారన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ అనుమతుల వెనుక పెద్ద ఎత్తున అవతవకలు జరిగాయని స్పష్టమవుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

**పట్టించుకోకపోతే.. కలెక్టరేట్ ముట్టడిస్తాం**

గత నెల రోజులుగా కింద నుంచి పైవరకు అధికారులందరికీ వినతిపత్రాలు ఇచ్చి విసిగిపోయామని జనం ఆవేదన వ్యక్తం చేశారు.

కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్, అదనపు కలెక్టర్‌లకు మూడు సార్లు మొరపెట్టుకున్నా ఉలుకూ పలుకూ లేకపోవడంతోనే ఈరోజు రోడ్డుపైకి రావాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి ఈ అక్రమ క్రషర్ అనుమతులను రద్దు చేయకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ రిలే నిరహారదీక్షా కార్యక్రమంలో రావల్ కోల్ గ్రామస్థులు మందపురం నరేశ్, మామిండ్ల వెంకటేశ, మామిండ్ల ఆనంద్, బంటు నర్సింగ్గారావు, బంటు మల్లేశ్, సుక్క శేఖర్, గడీల రమేశ్, ఎర్రవల్లి హారత్రెడ్డి, గున్నాల రాముగౌడ్, తెడ్డు రాజారామ్, మామిండ్ల గణేశ్, ఎక్కలదేవి శ్రీశైలం, గుమ్మడి బిక్షపతి, పిల్ల సాయి శ్రావణ్, పిట్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

---



పంచాయతీ ట్యాంకర్‌ను ప్రైవేట్ పనులకు వినియోగిస్తున్న దృశ్యం

# 'ప్రైవేట్' సేవలో పంచాయతీ ట్యాంకర్!

**కాంట్రాక్ట్ పనులకు నీటి సరఫరా**

**అక్రమంగా వసూళ్లు**

**అధికార దుర్వినియోగంపై గ్రామస్థుల ఆగ్రహం**

**కేశంపేట, మే 16, ప్రభాతవార్త:** ప్రజాధనంతో కొనుగోలు చేసిన పంచాయతీ వాహనం ప్రైవేటు వ్యక్తుల సేవలో తరిస్తోంది. కేశంపేట మండల పరిధిలోని పొమాల్ పల్లి గ్రామస్థుల తాగునీటి అవసరాలు తీర్చడం కోసం వాటర్ ట్యాంకర్ కొనుగోలు చేశారు. అయితే అది ప్రజావసరాల కోసం కాకుండా దుర్వినియోగం అవుతుండం సర్వత్రా చర్చనీయాంసమవుతోంది. పంచాయతీ పాలకవర్గానికి చెందిన కొంతమంది ప్రజాప్రతినిధులు వారి అధికారాలను దుర్వినియోగం చేస్తూ వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఈ ట్యాంకర్‌ను వినియోగిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ప్రైవేట్ కాంట్రాక్ట్ పనులకు ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తూ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

---

# కమీషన్ల కోసమే ఆపుతున్నారా!

**100 పనులకు మొదలు పెట్టింది ఇరవయ్యేనా..**

**ఎందుకు కాంట్రాక్టర్లు రావటంలేదు?**

**దిశ సమావేశంలో ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆగ్రహం**

**పిఆర్ అధికారుల ఉదాసీనతపై అసహనం**



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి కొండా విశ్వశ్వర్ రెడ్డి

**రంగారెడ్డి అర్బన్, మే16,ప్రభాతవార్త:** పంచాయతీరాజ్ శాఖలో కమిషన్ల వ్యవహారంపై చేవెళ్ల ఎంపీ కొండా విశ్వశ్వర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషన్ ఇస్తేనే పనులు చేస్తారా..? అంటూ అధికారులను నిలదీశారు. 12 శాతం కమిషన్ల కోసమే పనుల బిల్లులు విడుదల చేయడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయని మండిపడ్డారు. పార్లమెంట్ పరిధిలో మంజూరైన 100 పనుల్లో కేవలం 20 పనులు మాత్రమే ప్రారంభమయ్యాయని, రంగారెడ్డి జిల్లాలో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని విమర్శించారు. శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో ఎంపీ ఈ వ్యాఖ్యలు చేశారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డితో కలిసి వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో చేరాలని, గ్రామ, మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ సూచించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, సబ్సిడీల వివరాలను గ్రామాలు, మండలాలు, పట్టణ కేంద్రాల్లో సభల ద్వారా ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో టీచర్లు, సిబ్బంది కొరత లేకుండా చూడాలని, పిల్లలకు గుడ్డు, పాలు వంటి పోషకాహారం అందించాలని సూచించారు. జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు.

**అక్రమ మైనింగ్‌పై కొరడా**

అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్య, వైద్యం, మత్స్యశాఖల పనితీరుపై సమీక్ష జిల్లాలో అక్రమ మైనింగ్‌ను పూర్తిగా అరికట్టాలని మైనింగ్ శాఖ అధికారులను ఎంపీ ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు.

**చేపల వేటలో మత్స్యకారులకు శిక్షణ**

స్థానిక మత్స్యకారులకు చేపల వేటపై పూర్తి స్థాయి శిక్షణతో పాటు వలలు అందించాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు. దీంతో మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. చిరు వ్యాపారులకు త్వరితగతిన రుణాలు అందిచాలని సూచించారు.

**డబుల్ బెడ్రూం ఇళ్లలో స్థానికులకు ప్రాధాన్యం**

ముద్ర, విశ్వకర్మ వంటి పథకాల కింద దరఖాస్తు చేసుకున్న చిరు వ్యాపారులకు బ్యాంకులు త్వరగా రుణాలు మంజూరు చేయాలని ఎంపీ ఆదేశించారు. ఇప్పటికే నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపులో స్థానికులకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. పశువైద్య సేవలు అందుబాటులో పశువైద్య ఆసుపత్రుల్లో అధికారులు అందుబాటులో ఉండడం లేదని దిశా కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, గోపాలమిత్ర పథకం ద్వారా పశువులకు సత్వర వైద్య సేవలు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణ రెడ్డి తమ నియోజకవర్గ సమస్యలను ఎంపీ, కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

---


హత్యకు గురైన మహిళలు

# అప్పు తీర్చలేక హత్య!


**పథకం ప్రకారం ఇద్దరు మహిళలను హతమార్చిన వైనం**

**అడవిలో పూడ్చిపెట్టిన నిందితులు**

**ముడిమాల్ రిజర్వ్ ఫారెస్ట్‌లో కలకలం**

**మొయినాబాద్, మే 15, ప్రభాతవార్త :** తీసుకున్న అప్పు తిరిగి చెల్లించలేక ఇద్దరు వృద్ధ మహిళలను దారుణంగా హత్య చేసి అడవిలో పూడ్చిపెట్టిన సంఘటన మొయినాబాద్-చేవెళ్ల సరిహద్దులోని ముడిమాల్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. తాండూర్ సీఐ, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం ఖాసీంపూర్ గ్రామానికి చెందిన అబేదా బేగం అంగన్వాడీ ఆయాగా పనిచేస్తోంది. ఆమెకు పరిచయమున్న కరీమా బేగంకు సుమారు మూడు సంవత్సరాల క్రితం రూ.2 లక్షలు అప్పుగా ఇచ్చింది. ఇందులో రూ.50 వేల వరకు మాత్రమే తిరిగి చెల్లించగా, మిగిలిన రూ.1.50 లక్షలు ఇవ్వాలని అబేదా బేగం పలుమార్లు ఒత్తిడి చేసింది. ఈ నేపథ్యంలో అప్పు తీర్చలేకపోయిన కరీమా బేగం, తనకు పరిచయమున్న రహమత్, మొయినాబాద్ మిగతా 4లో

---




# తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్..

**మేడ్చల్ నుంచి బైకు మీద వచ్చి దోపిడి**

**షాద్‌నగర్, మే 16, ప్రభాతవార్త :** తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్గా చోరీలకు అలవాటు పడ్డ ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి షాద్ నగర్ లో కూడా చోరీకి పాల్పడి చివరికి ఇక్కడి పోలీసుల చేతికి చిక్కారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను షాద్ నగర్ ఏసీపి లక్ష్మీనారాయణ వివరించారు. పట్టణంలోని జి హెచ్ ఆర్ కాలనీకి చెందిన కుక్కలి రమేష్ ఈనెల 7వ తేదీన తన భార్యకు అనారోగ్యంగా ఉండడంతో ఆసుపత్రిలో చూపించి తన స్వగ్రామమైన వీరన్న పేటకు తీసుకువెళ్లాడు. తిరిగి ఈ నెల 9వ తేదీన ఇంటికి వచ్చి చూస్తేసరికి ఇంటి తాళం పగలగొట్టబడి ఉంది. ఇంట్లో చిన్న చెవి కమ్మలు రెండు గ్రాములు, చిన్న చెడిపోగులు ఒక గ్రామం, నాలుగు తులాల వెండి కడియాలు, వెండి కాళ్ల పట్టాలు, బంగారు చెవి కమ్మలు, 25 తులాల వెండి మిగతా 4లో

---



ఇళ్లల్లో సహాయకుల వివరాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న శామీర్‌పేట పోలీసులు

# ఇంటింటికీ 'మీ సురక్ష'


**సహాయకుల వివరాల సేకరణకు శ్రీకారం**

**నేపాలి ముఠా ఘటనతో అలర్ట్**

**శామీర్‌పేట సిఐ శ్రీనాథ్**

**శామీర్‌పేట, మే 16, ప్రభాతవార్త :** జవహర్‌నగర్‌లో నేపాలి దొంగల ముఠా సంఘటనతో మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ ప్రారంభించిన మీ సురక్షా కార్యక్రమం కింద శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజల ఇళ్లల్లో సహాయకుల వివరాల సేకరణకు పోలీసు బృందాలను ఏర్పాటు చేసి అప్రమత్తతకు శామీర్‌పేట సిఐ శ్రీనాథ్ అవగాహన కల్పించారు. శనివారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో మీ సురక్షా కార్యక్రమం పట్ల అవగాహన మిగతా 4లో

---



# సాంప్రదాయ కళలకు పునర్జీవం

**-జిల్లా అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్**

**వికారాబాద్, ప్రభాతవార్త :** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయని జిల్లా అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. శనివారం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో విద్యా వారోత్సవాలలో భాగంగా వికారాబాద్ డైట్ కళాశాలలోని సమావేశ మందిరంలో జరిగిన కళలు, హస్తకళలు, సాంస్కృతిక దినోత్సవం కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన హస్తకళా ప్రదర్శనను, విద్యార్థుల ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్క విద్యార్థి లోను నిగూఢమైన ప్రతిభ దాగి ఉంటుందని, ఆ ప్రతిభను మిగతా 4లో

---

# పెట్రో నిరసన హోరు


ఘట్‌కేసర్‌లో ఆటోను తాళ్లతో లాగుతున్న సిపిఎం నాయకులు

# పెంచిన ఇంధన ధరలను తగ్గించాలి


ఆమనగల్లులో నిరసన తెలుపుతున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

**ఆమనగల్లు, మే16, ప్రభాతవార్త:** పెంచిన పెట్రోల్, డీజిల్ ధలను కేంద్ర ప్రభుత్వం బేషరత్తుగా తగ్గించాలని ఆమనగల్లు మండల యూత్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. పెంచిన ఇంధన ధరలతో సామాన్య ప్రజలపై పెనుభారం పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమనగల్లు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగడుతూ దిష్టిబొమ్మను దగ్ధం చేసింది. మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో యూత్ కాంగ్రెస్ నాయకుల తోపాటు కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాజీవ్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా వస్పుల శ్రీకాంత్ మాట్లాడుతూ నాలుగు రాష్ట్రాల ఎన్నికలలో లబ్ధి పొందేందుకు బీజేపీ కుట్రలు చేసి ఎన్నికల అనంతరం ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. పెంచిన ఇంధన ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం అధికమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే నిత్యవసర వస్తువుల పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్న కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షుడు జగన్, కసిరెడ్డి నారాయణరెడ్డి, విజయ్, కృష్ణా నాయక్, శివలింగం, మల్లేశ్, అలీమ్, కొండల్‌రెడ్డి, ఫరీద్, ఎంగలిప్రసాద్, మహేశ్, గుండ్రాతి కుమార్‌గౌడ్, రాజేశ్, శివ తదితరులు ఉన్నారు.

**కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం**

**జవహర్ నగర్, మే 16.ప్రభాతవార్త :** పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంధన ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఇంధన ధరల పెంపుకు నిరసనగా శనివారం జవహర్ నగర్ ప్రధాన రహదారిపై సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తోటపల్లి శంకర్ మాట్లాడుతూ, పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు అధికమై అన్ని రంగాలపై ప్రభావం పడుతోందన్నారు. రైతులు, చిన్న వ్యాపారులు, కార్మికులు ధరల భారంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం స్థిరమైన విధానాన్ని అవలంబించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు. పెంచిన ఇంధన ధరలను వెంటనే తగ్గించకపోతే ప్రజల పక్షాన ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జవహర్ నగర్‌లో కేంద్రం దిష్టి బొమ్మను దగ్ధం చేస్తున్న సిపిఎం నేతలు

**కీసర సర్కిల్‌లో..**

**కీసర, మే16, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డిజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం మండల నాయకులు బంగారు నర్సింగ్‌రావు డిమాండ్ చేశారు. శనివారం కీసర సర్కిల్ పరిధిలోని దమ్మాయిగూడ దుబాయ్ బిల్డింగ్ వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం పేద ప్రజల నడ్డి విరిచే విధంగా పెట్రోల్, డిజిల్, గ్యాస్ ధరలను అమాంతం పెంచడం దుర్మార్గమన్నారు. పెట్రోల్, డిజిల్ రేట్లు పెరగడం వలన రవాణ చార్జీలు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానంటే ప్రమాదం ఉందన్నారు. రోజువారి ఖర్చులు పెరిగి సామాన్య ప్రజల బ్రతుకు భారంగా మారి అర్ధాకలితో అలమటించే రోజులు పునారావృతం అవుతాయన్నారు. చాలీచాలని జీతాలతో బ్రతుకుతున్న ప్రజలపై భారాలు మోపే ప్రభుత్వాలను గద్దె దింపితే తప్ప ప్రజల బ్రతుకులు మారవన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి అధిక ధరలను నియంత్రించి ప్రజలపై భారాలను తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చింతకింది అశోక్, శివన్నారాయణ, మోత్కుపల్లి రాములమ్మ, బాలమ్మ, సుగుణ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.


కీసరలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

**ఆటోకు తాడి కట్టి లాగుతూ...**

**ఘట్‌కేసర్, మే 16, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్, సీఎన్‌జీ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి నార్కట్‌పల్లి సబిత, సీనియర్ నాయకులు చింతల యాదయ్యలు డిమాండ్ చేశారు. ఇంధన ధరల పెంపుపై ఘట్‌కేసర్‌లో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఆటోకు తాడి కట్టి లాగుతూ వినూత్న నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా చింతల యాదయ్య, సబితలు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ.3, సీఎన్‌జీపై కిలోకు రూ.2 ల చొప్పున పెంచడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే ఆస్కారముందని విమర్శించారు. ఇప్పటికే ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరిగి వేతనాలు స్తంభించగా ఆర్థిక సంక్షభంతో శ్రామిక ప్రజలపై మరింత భారం పడుతుందని, పెరుగుతున్న ప్రపంచ ముడిచమురు ధరల కారణంగా అన్ని ధరలు పెరిగి నిరుపేద, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతారని పేర్కొన్నారు. రవాణా ఖర్చుఎపై ప్రతికూల ప్రభావం చేపడమే కాకుండా నిత్యావసర వస్తువులు, వ్యవసాయ ఉత్పాదకాలు, ప్రాథమిక సేవల ధరల పెరుగుదలతో పహ ఆర్థిక వ్యవస్థ అంతటా ఇవి గొలుసుకట్టు ప్రభావాన్ని ప్రేరేపించడం ఖాయమని అన్నారు. సీఎన్‌సీ ధరల పెంపుతో ఆటోడ్రైవర్లు, రవాణా కార్మికులు, సరసమైన ప్రజా, భాగస్వామయ్య రవాణాపై ఆధారపడిన లక్షలాది మందిని నేరుగా ప్రభావితం చేస్తుందన్నారు. ఎన్నికల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ఈప్రకటనను ఆలస్యం చేసిందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాని వారు డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కడమంచి యాదగిరి, కె.అలివేల, ట్రాన్స్‌ఫోర్ట్ యూనియన్ నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ, వెంకటేశ్, శరవనంద, భూమయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


రాహుల్ గాంధీకి పూలబొకే అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

## మంత్రి పదవికి అర్హుడినే

### -రాహుల్ గాంధీకి పరిగి ఎమ్మెల్యే వినతి

**పరిగి, మే 16, ప్రభాతవార్త :** మూడు తరాల నుంచి కాంగ్రెస్ పార్టీకీ పనిచేశానని, బూత్ లెవల్ స్థాయి నుంచి ఎదిగి పరిగి అసెంబ్లీ నుంచి నాలుగు సార్లు పోటీ చేశానని, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి తనకు మంత్రి పదవి కేటాయించాలని శనివారం డిల్లీ లో రాహుల్ గాంధీని కలిసి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి వినతి పత్రం అందించారు. కేబినట్ లో 3శాఖలకు మంత్రి పదవులు కేటాయంచలేదని, జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న సీనియర్ నేతగా ఉన్న తనకు మంత్రి పదవి ఇవ్వాలని రాహుల్ గాందీని రామ్మోహన్ రెడ్డి కోరారు. డీలిమిటేషన్ లో భాగంగా 44 నియోజకవర్గాలు, 8 పార్లమెంట్ స్థానాలు పెరిగే అవకాశం ఉందని, పార్టీ అధికారంలోకి రావాలని ఏకైక లక్ష ్యంతో తాను పని చేసానని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ,తనకు మంత్రి పదవి కేటాయించేలా రాహుల్ గాంధీతో మాట్లాడి అవకాశం కల్పిస్తారని ఆశిస్తున్నానని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ప్రకటనలో తెలిపారు.

## లింగరావుపల్లిలో వీధి దీపాలు ఏర్పాటు

**తలకొండపల్లి, మే 16, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని లింగ రావు పల్లి గ్రామంలో శనివారం నాడు వీధి దీపాలను ఏర్పాటు చేశారు. లింగరావుపల్లి గ్రామంలోని స్థానిక రాజీవ్ గాంధీ కాలనీలో వీధి దీపాలు లేక అనేక ఇబ్బందులకు గురయ్యారు. అక్కడ ఉన్న సబ్ స్టేషన్ కెపాసిటీ లేకపోవడంతో ప్రతిరోజు విద్యుత్ దీపాలు పడిపోతుండేవి. గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా సబ్ స్టేషన్ లో కెపాసిటీ నీ పెంచి నూతనంగా విద్యుపాలను అమర్చించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ కాలనీలో విద్యుత్ ద్వీపాల సమస్య ఉండడంతో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో సబ్ స్టేషన్ కెపాసిటీ సిటీని పెంచి విద్యుత్ దీపాలు అమర్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## అప్పు తీర్చలేక హత్య!

(మొదటి పేజీ తరువాయి)

మండలం తోల్కట్ట గ్రామానికి చెందిన నయీమ్‌తో కలిసి పథకం రచించినట్లు పోలీసులు తెలిపారు. డబ్బుల విషయం మాట్లాడుకుందామని నమ్మించి అబేదా బేగంను ఈ నెల 5వ తేదీన మొయినాబాద్ ప్రాంతానికి రప్పించారు. అనంతరం ఆమెపై దాడి చేసి దారుణంగా హత్య చేసి అడవిలో పూడ్చిపెట్టినట్లు వెల్లడైంది. అయితే అబేదా బేగం కనిపించక పోవడంతో ఈ నెల 4వ తేదీన బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు అయింది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆమె చివరి సారిగా ఎవరితో మాట్లాడిందనే కోణంలో ఫోన్ కాల్ డేటా, లొకేషన్ ఆధారంగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో కరీమా బేగంతో జరిగిన సంభాషణలు, ఫోన్ లొకేషన్ వివరాలు మొయినాబాద్-చేవెళ్ల సరిహద్దులోని ముడిమాల్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాన్ని సూచించడంతో పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో నిందితులు అబేదా బేగంను హత్య చేసి తోల్కట్ట రెవెన్యూ సర్వే నంబర్ 113 సమీపంలోని రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో పూడ్చిపెట్టినట్లు ఒప్పుకున్నారు. ఇంకా లోతుగా విచారణ చేపట్టగా మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం కోకట్ గ్రామానికి చెందిన మహబూబీ (65), ప్రస్తుతం తాండూర్ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటూ గతంలో కరీమా బేగంకు రూ.40 వేల అప్పు ఇచ్చింది. ఆ డబ్బులు తిరిగి ఇవ్వకుండా, ఇస్తానని నమ్మబలికి సుమారు 45 రోజుల క్రితం ఇదే రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతానికి పిలిపించి ఆమెను కూడా హత్య చేసి అడవిలో పాతిపెట్టినట్లు నిందితులు అంగీకరించారు. దీంతో పోలీసులు మహబూబీ కుటుంబ సభ్యులకు సమాచారం అందించి వారిని సంఘటన స్థలానికి రప్పించారు. ఇద్దరు మహిళల కుటుంబ సభ్యుల సమక్షంలో మొయినాబాద్ పోలీసులు, తాండూర్ సీఐ, మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్ కుమార్ ఆధ్వర్యంలో శవాలను వెలికితీసి శవపంచనామా నిర్వహించారు. అనంతరం ఆస్తికలను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ కేసులో నిందితులను అదుపులోకి తీసుకున్న తాండూర్ పోలీసులు వారిని రిమాండ్‌కు తరలించి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## తాళం వేసిన ఇళ్లే టార్గెట్

(మొదటి పేజీ తరువాయి)

పట్టా గొలుసులు మాయం అయ్యాయి. దీనితో బాధితుడు షాద్ నగర్ పోలీసులను ఆశ్రయించాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు. ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి, డీసీపీ శిరీషల నేతృత్వంలో ఏసీబీ లక్ష్మీ ్మనారాయణ ఆధ్వర్యంలో సిఐ సీతారాం, శివారెడ్డి ఒక టీంను ఏర్పాటు చేసి ఈ సంఘటనపై వేగంగా విచారణ మొదలుపెట్టారు.

**దొంగలు దొరికారు ఇలా..**

సీసీటీవీ ఫుటేజ్ లను, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని పోలీసులు విచారణ మొదలుపెట్టారు. మేడ్చల్‌కు చెందిన రోహిత్ కుమార్, శివం సింగ్, సాగర్ కుమార్ రవి దాస్ లు ఈ కేసులో నిందితులుగా గుర్తించారు. వారిని అరెస్టు చేసి విచారించగా ఆరోజు అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో తాళాలు విరగ్గొట్టి ఇంట్లో ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు స్పష్టం చేశారు. అందులో కొంతమంది అమ్మి రూ. 40000 సొమ్ము చేసుకున్నారు. వారిని పట్టుకున్న పోలీసులు వారి నుంచి 20వేల నగదు, ఒక ద్విచక్ర వాహనం,రెండు సెల్ ఫోన్లు, ఒక జత వెండి కడియాలు, వెండి పట్టా గొలుసులు, రెండు జతల బంగారు చెవి కమ్మలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణలో సహకరించిన ప్రత్యేక పోలీసు బృందం ప్రభాకర్ గౌడ్, రవీందర్, మోహన్, కరుణాకర్, జావేద్, రాజు, సంతోష్, రఫీ లకు అధికారులు రివార్డులను అందించారు.

## ఇంటింటికీ 'మీ సురక్ష'

(మొదటి పేజీ తరువాయి)

కల్పించటానికి పోలీసు బృందాలను నియమించి వివరాల సేకరణకు సిద్ధం చేశారు. శామీర్‌పేట సిఐ శ్రీనాథ్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్లల్లో యజమానులు కొందరు పనికోసం సహాయకులుగా నియమించుకుంటే వారి వివరాల నమోదు చేయటం జరుగుతుందని, అద్దెదారుల, సెక్యూరిటీ సిబ్బంది, ఒంటరిగా నివసించే వృద్ధుల వివరాలను కూడ సేకరించటం జరుగుతుందని పోలీస్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. మల్కాజ్‌గిరి సిపి సూచనల మేరకు శామీర్‌పేట పిఎస్ పరిధిలో వివరాల సేకరణ కోసం 20బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ టీమ్‌లు ఇంటింటా పర్యటించి వివరాలను సేకరించటం జరుగుతుందన్నారు. భద్రత విషయంలో ప్రజల సహకారం పోలీసులకు ఎంతో అవసరమని, అప్రమత్తత, ముందస్తు జాగ్రత్తలు, పోలీస్ వెరిఫికేషన్ ద్వారా అనేక నేరాలను నివారించటానికి వీలు అవుతుందన్నారు. ప్రజల భద్రతే మా ప్రాధాననయత అనే లక్ష్యంతో మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవగాహణ కార్యక్రమాల్లో డిఐ, ఎస్ఐలు, ఎఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

### పశువుల రవాణాదారులకు అవగాహన

**సంజీవరెడ్డి నగర్, మే 16, ప్రభాతవార్త:**

సనత్‌నగర్ ఇన్స్పెక్టర్ డి. అశోక్ ఆధ్వర్యంలో శనివారం బాబ్బుగూడ పశువుల మార్కెట్‌లో జేబీ జోన్ డీసీపీ, ఏఎంసీ చైర్మన్, కార్యదర్శి, వెటర్నరీ అధికారులతో కలిసి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువుల రవాణాదారులకు పశువులను చట్టబద్ధంగా ఎలా రవాణా చేయాలన్నారు.

# అంజనీపుత్రుడికి ఘనంగా పల్లకీ సేవ

**షాద్‌నగర్, మే 16, ప్రభాతవార్త :** షాద్ నగర్ మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ, జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీ రామ నామస్మరణతో మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రాచార్య, అర్చకులు, ప్రమోద్, సునీల్ పంతులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శని త్రయోదశి అమావాస్యలను పురస్కరించుకొని దేవాలయంలో నవగ్రహ పూజలు హోమం గోపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు అందే బాబయ్య పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొత్తూరు గ్రామానికి చెందిన జండగూడెం రామకృష్ణ గౌడ్ అశ్విని దంపతులు దేవాలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేసిన జాండగూడెం రామకృష్ణ అశ్విని లకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో పూలమాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మండువేసవిలో భక్తుల దాహార్తి తీర్చేందుకు దాత బొట్టు రమేష్ మిత్ర బృందం చల్లని మంచినీటిని భక్తులకు అందజేశారు. ఈ


పూజల్లో పాల్గొన్న భక్తులు..

కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్, జి.వసంతరావు, అన్నారం రఘు గౌడ్, మంచిరేవుల అశోక్, నార్య నాయక్, గడ్డమీద రమేష్ ముదిరాజ్, శంకర్ గౌడ్, క్యాసెట్ శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, యాదగిరి, తులసి రామ్, రఘునందన్ రెడ్డి, సుప్ప నర్సింలు, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, శంకరయ్య, వీఆర్వో బచ్చన్న, సుప్ప కృష్ణయ్య, పి.ప్రవీణ్ గౌడ్, పద్మా వెంకటేష్, జగన్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్, రమేష్, రవి, హనుమంత్ రెడ్డి, రవీందర్, నరసింహులు, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష ్మయ్య, భజన భక్త బృందం మహిళలు తదితరులు పాల్గొన్నారు..

# విద్యార్థులు ఉన్నత స్థానాల్లో రాణించాలి


**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 16, ప్రభాతవార్త :** విద్యార్థులు భవిషత్‌లో ఉన్నత చదువులు చదివి మంచి స్థానాల్లో రాణించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లో విద్యా విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఇఓ విజయకుమారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. పదవతరగతి ఫలితాల్లో, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో టాప్ టెన్, క్రీడా విభాగంలో టాప్-3 విద్యార్థులను ఉల్లాస్ వలంటీర్స్ బాగా పనిచేసినటువంటి ముగ్గురిని కలెక్టర్ చేతుల మీదుగా సత్కరించారు. టెన్త్, ఇంటర్‌లో జిల్లా స్థాయిలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పదివేల రూపాయల నగదు పారితోషికం, ఒక మెమోంటో, ప్రశంసపత్రంలు కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగ జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరటానికి మార్గనిర్దేశం చేయటం జరిగింది. కలెక్టర్ తన స్కూల్ జీవితాన్ని అనుభవాలను ఆ విద్యార్థులతో పంచుకోవటం జరిగింది. తాను ఏ జిల్లాలో పనిచేసినపనపటికీ ప్రతిభాపురస్కారాలు అందుకున్నటు వంటి విద్యార్థులు వారి ఉన్నత చదువుల కోసం మంచిగా చదువుకోవటానికి కావలసిన వసతులు కల్పించటానికి ఎల్లవేళల్లో అందుబాటులో ఉంటానని మాట ఇచ్చి విద్యార్థులను ఉత్తేజపరిచారు. డిఇఓ విజయకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ


మాట్లాడుతున్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి

పాఠశాలల్లో కూడ మంచి ప్రతిభావంతులైన విద్యార్థులు చదువుకోవటం గర్వంగా ఉందని, జిల్లా ఫలితాల్లో భాగస్వామ్యం వహించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను ప్రశంసించారు. ఇక ముందు కూడ మంచి ఫలితాలు సాధించి ఉజ్వల భవిషత్‌లో స్థిరపడాలని ఆమె విద్యార్థులను దీవించారు. ఆ తరువాత ర్యాంకులు సాధించిన విద్యార్థులతో, తల్లిదండ్రులతో, ఉపాధ్యాయులతో వారు జీవిత కాల జ్ఞాపకాల కోసం ఫోటోసెషన్స్‌కు జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఇఓ విజయకుమారి, జిల్లా సంబంధిత శాఖల అధికారులు కూడ పాల్గొనటం జరిగింది.

# వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలి

**తాండూరు, మే 16, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరులోని మాతా శిశు ఆసుపత్రిని జిల్లా అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో ఇటీవల జరిగిన ఘటనలపై శనివారం సబ్‌కలెక్టర్ ఆసుపత్రిని సందర్శించి ఆరా తీశారు. అదేవిదంగా ఆసుపత్రి భవన పరిస్థితి, మరుగుదొడ్లు, పారిశుధ్యం, ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు పట్టిక, మందుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. రోగులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, అవసరమైన మందులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అదేవిదంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వైద్యులు వైద్యులు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని



హెచ్చరించారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. సబ్ కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శరత్, ఆర్ఎంఓ అనిల్, సునీత, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, వైద్యులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



## ఇళ్లలో పనిచేసే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

**ఘట్‌కేసర్, వమే 16, ప్రభాతవార్త:** ఇళ్ల పనిచేసే వ్యక్తుల పట్ల యాజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మేడిపల్లి ఏసీపీ మోహన్ పేర్కొన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ కొండాపూర్‌రోడ్డులోని సన్‌షైన్ పార్క్‌కాలనీలో శనివారం సాయంత్రం దొంగతనాల నివారణపై మీసురక్ష అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ మోహన్, ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామిలు పాల్గొని ఇళ్లలో జరుగుతున్న చోరీల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై కాలనీవాసులకు వివరించారు. ఇళ్లలో పనిచేయడానికి వచ్చే వ్యక్తుల చిరునామా, ఆధార్‌కార్డు, ఇతర పూర్తి వివరాలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో నేపాలీలు ఇళ్లలో దోపిడిలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఇండ్లలో పనిచేసే వారు, రాత్రిపూట గస్తీ కాసే సెక్యూరిటీల గుర్తింపులను ముందుగానే సేకరించుకొని అవసరమైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఘట్‌కేసర్



ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి, సన్‌షైన్‌పార్క్ కాలనీ అధ్యక్షులు, స్థానికులు పాల్గొన్నారు.

## చేవెళ్లలో యువత రక్తదానం

**చేవెళ్ల, మే 16, ప్రభాతవార్త :** చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం ఎమ్మెల్యే యాదయ్య తన పుట్టిన రోజు సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మి ్మ బాలాజీ వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో పార్టీ ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే యాదయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతోపాటు పట్టణ కేంద్రంలో ఉన్న మహనీయుల విగ్రహాలకు పూల మాలాలలు వేశాడు. అనం తరం చేవెళ్ల మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అక్కడి నుంచి నేరుగా కేజీఆర్ గార్డెన్ వరకు ర్యాలీగా వెళ్లి ప్రత్యేంగా ఏర్పాటు చేసిన జన్మదిన కేక్ను ఎమ్మెల్యే కట్ చేశారు. ఈ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న హాట్రిక్ ఎమ్మెల్యే యాదయ్య అంటు కేక్ తినిపించి యాదన్న జిం దాబాద్ అంటు నినాదాలు చేశారు. ఎమ్మెల్యే పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు ఖిచేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. 211 మంది రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఎమ్మెల్యే యాదయ్యకు చేవెళ్ల ఆర్డీవో పార్థసిం హారెడ్డి తోపాటు ఆయా మండలాలకు చెందిన ఆయా శాఖల అధికారులు ప్రత్యేకంగా ఎమ్మెల్యేను సన్మానించారు. అలాగే ఎమ్మెల్యే యాదయ్య పుట్టిన రోజు వేడుకలకు కర్ణటక రాష్ట్రానికి చెందిన స్వామిజీ అప్పాజీ తోపాటు జోగిని హాజరు అయ్యి ఎమ్మెల్యేను ఘనంగా శాలువాతో సన్మానించి కేక్ తినిపించి జన్మదిన శుభాకాంకలు తెలిపారు.

## సాంప్రదాయ కళలకు పునర్జీవం

(మొదటి పేజీ తరువాయి)

వెలికితీయడానికి ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. నేటి సాంకేతిక యుగంలో సాంప్రదాయ కళలు అంతరించి పోతున్నాయని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఆ కళలకు పునర్జీవం పోయడం జరుగుతందని తెలిపారు. అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు వికారాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఎంఈఓ బాబుసింగ్, పీఆర్‌టీయూ టీఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు కడియాల చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు యాదయ్య, కళా ఉత్సవ్ అధ్యాపకులు రామ్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతోనే డెంగ్యూ నివారణ

**షాద్‌నగర్, మే 16, ప్రభాతవార్త :** భారతదేశంలో ప్రతి సంవత్సరం మే 16వ తేదీన జాతీయ డెంగ్యూ దినోత్సవం జరుపుకుంటారు. కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈరోజు జాతీయ డెంగు దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఈ రోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చించోడు లో డాక్టర్ సంధ్య ఎం ఎల్ హెచ్ పి వైద్యాధికారి జాతీయ డెంగ్యూ దినోత్సవం ర్యాలీని జండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ హెల్త్ ఎడ్యుకేట్ ఆర్ జె శ్రీనివాసులు డెంగు వ్యాధి నివారణ గురించి దోమల నివారణ గురించి స్లొగన్స్ చెప్పుకుంటూ ర్యాలీని చించోడు గ్రామంలో ముందుకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, హెల్త్ సూపర్వైజర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటెడ్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ డెంగ్యూ ఒక ప్రమాదకరమైన వైరల్ జ్వరము అని, ఇది డెంగ్యూ ఫేవర్ వ్యాధిని కలిగించే ఏడిస్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుందని తెలిపారు. డెంగ్యూ వచ్చినప్పుడు అధిక జ్వరం తీవ్రమైన తలనొప్పి కళ్ళ వెనుక నొప్పి శరీరం నొప్పులు వాంతులు మరియు చర్మంపై ఎర్రటి మచ్చలు కనిపిస్తాయి అని, కొన్ని సందర్భాల్లో ఇది ప్రాణాపాయం కూడా కలిగించవచ్చు అని జె.శ్రీనివాసులు చెప్పారు. అందుకే ముందు జాగ్రత్తలు చాలా అవసరమని తెలిపారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూడడం, నీటి ట్యాంకులు మరియు పాత్రలను మూతపెట్టడం, పాత టైర్లు మరియు కొబ్బరి చెక్కలలో నీరు నిల్వ కాకుండా తొలగించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డెంగ్యూ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రి వెళ్లి డాక్టర్ ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.